# క్రైమ్ కౌంటర్

webisite:www.crimecounter.in

ప్రజా సంక్షేమమే అంతిమ లక్ష్యం

తెలుగు దిన పత్రిక

సంపుటి : 02 సంచిక : 155 గుంటూరు, శనివారం 14- 02 - 2026 పేజిలు : 4 వెల. 2 /-



రిపోర్టర్లు కావలెను

క్రైమ్ కౌంటర్

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో

- జిల్లా బ్యూరోలు
- జిల్లా ఇన్‌చార్జీలు
- నియోజక వర్గ ఇన్‌చార్జీలు

కావలెను.



సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

98497 07349


## ఏపీ బడ్జెట్‌లో ప్రజలకు శుభవార్త...

# ఈ పథకాలకు ప్రత్యేక నిధులు



**అమరావతి, ఫిబ్రవరి 13 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఫిబ్రవరి 14న ఏపీ ప్రభుత్వం అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఇప్పటికే 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ రూపుదిద్దుకోగా.. శనివారం ఉదయం 10 గంటలకు ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్ కోసం రాష్ట్ర ప్రజలందరూ ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనులకు సంబంధించి ఎలాంటి నిర్ణయాలు ఉంటాయనేది చర్చనీయాంశంగా మారింది. కొత్త పథకాలు కూడా ఈ బడ్జెట్‌లో ఉండనున్నట్లు తెలుస్తోంది. మొత్తం రూ.3.35 లక్షల కోట్ల నుంచి రూ.3.48 లక్షల మంది బడ్జెట్ ఉండొచ్చని తెలుస్తోంది.అమరావతికి భారీగా నిధులు

ఇప్పటికే ఏపీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యా. రాష్ట్ర గవర్నర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. బడ్జెట్‌పై ఇప్పటికే కసరత్తు పూర్తవ్వగా.. ఏయే శాఖకు ఎంత నిధులు కేటాయించాలనే దానిపై మంత్రులతో పయ్యావుల కేశవ్ వరుస సమావేశాలు నిర్వహించారు. ఏయే శాఖకు బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలనే దానిపై చర్చలు జరిపారు. అనంతరం శాఖల వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. సంక్షేమ పథకాలతో పాటు అభివృద్ధి సమానంగా ఉండేలా బడ్జెట్‌లో కేటాయింపులు జరిపినట్లు సమాచారం. ఇరిగేషన్ ప్రాజెక్టులకు ఈ సారి బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు ఉంటాయని తెలుస్తోంది. అలాగే పోలవరం, అమరావతికి భారీగా నిధులు సమకూర్చనున్నారు. ఇక రాయలసీమ-ఉత్తరాంధ్రలోని అభివృద్ధి ప్రాజెక్టులకు నిధుల కేటాయింపు పెద్ద మొత్తంలో ఉండనుంది.

**పథకాలకు ప్రత్యేక నిధులు** ఇక ఈ బడ్జెట్‌లో సంక్షేమ పథకాలకు కూడా ప్రత్యేక నిధులు కేటాయించనున్నారు. దీపం 2.0తో పాటు స్త్రీశక్తి, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా, మిగతా సంక్షేమ పథకాలకు భారీగా నిధులు మంజూరు చేయనున్నారు. అటు పారిశ్రామిక రంగాన్ని రాష్ట్రంలో ప్రోత్సహించేందుకు ప్రత్యేక నిధులు కేటాయించనున్నట్లు తెలుస్తోంది. ఇక రాష్ట్రంలో నూతన రోడ్లు, రోడ్ల అభివృద్ధిపై కూడా బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వనున్నారు. కొత్త రోడ్ల నిర్మాణం, పాత హోలస్ రోడ్డకు నిధులు ఇవ్వనున్నారని సమాచారం. ఇక హార్టికల్చర్, లాజిస్టిక్స్ సెక్టార్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఉండనున్నాయి. అటు జల జీవన్ మిషన్ పథకానికి కూడా ప్రత్యేక నిధులు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. కాగా బడ్జెట్ కసరత్తుపై సీఎం చంద్రబాబు ఇప్పటికే అన్ని శాఖల అధికారులతో చర్చలు జరిపారు. అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహించారు. అన్ని శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనల ఆధారంగా బడ్జెట్‌ను రూపొందించారు. సంక్షేమ పథకాలే కాకుండా రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకెళ్తుంది. దీంతో బడ్జెట్‌లో అభివృద్ధి పనులకు భారీగా నిధులు ఉండనున్నాయని తెలుస్తోంది.



## మోదీ రాజకీయ జీవితంపై

# ట్రంప్ వ్యాఖ్యలు..

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాజకీయ జీవితంపై అగ్రరాజ్యం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేయగా.. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్ కాగా.. అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది. ఈక్రమంలోనే దీనిపై దీనిపై భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ (వీజూా) స్పందిస్తూ అత్యంత కీలక ప్రకటన చేసింది. గురువారం జరిగిన వారంతపు మీడియా సమావేశంలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. ట్రంప్ మోదీపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు. ఈ వీడియో కనుక నిజమని తేలితే తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అసలేం జరిగిందంటే..?

వైరల్ అవుతున్న వీడియోలో.. ట్రంప్ ఎఫ్‌బీఐ డైరెక్టర్‌తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్నారు. ఈక్రమంలోనే ఆయన మోదీని ఒక గొప్ప మనిషి అని కొనియాడారు. ముఖ్యంగా మోదీకి ట్రంప్ అంటే చాలా ఇష్టం అని, ఇక్కడ ఇష్టం అంటే కేవలం స్నేహపూర్వకమైన భావం మాత్రమే అని అర్థం చేసుకోవాలంటూ వ్యాఖ్యానించారు. దానిని మరోలా తీసుకుంటే ఆయన రాజకీయ జీవితం దెబ్బతింటుందని.. అది నాకు ఏమాత్రం ఇష్టం లేదంటూ ట్రంప్ చెప్పుకొచ్చారు. అక్కడితో ఆగకుండా తాను ఇండియాను ఎన్నో ఏళ్లుగా గమనిస్తున్నానంటూ సరదాగా వ్యాఖ్యానించారు. అయితే ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతుండగా.. అంతర్జాతీయ

2లో

# జగన్ అండ్ కోపై లోకేశ్ ధ్వజం



**అమరావతి, ఫిబ్రవరి 13 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఆంధ్రప్రదేశ్ శాసనసభ, మండలిలో ఇవాళ(శుక్రవారం) టీడీపీ, వైసీపీ నేతల మధ్య మాటల యుద్ధం రాజుకుంది. ఏపీ అసెంబ్లీ, మండలిలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగంపై పెట్టిన తీర్మానంపై చర్చించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి అంబటి రాంబాబు వ్యాఖ్యలపై శాసన మండలిలో దుమారం రాజుకుంది. అంబటి రాంబాబు వ్యాఖ్యలపై ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి తల్లిని అంబటి రాంబాబు అవమానించారని లోకేశ్ ధ్వజమెత్తారు. ఈ విషయంలో ఆయనని వదలిపెట్టేది లేదని అన్నారు. సీఎం తల్లిని దారుణంగా అవమానిస్తే అది చిన్నమాట అవుతుందా? అని నిలదీశారు. అయితే, మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతు ండగా.. విపక్షనేత బొత్స సత్యనారాయణ పలుమార్లు అడ్డుతగిలారు. మహిళలను గౌరవించాలి..

వైసీపీ నేతలు అంబటి రాంబాబును, ఆయన వ్యాఖ్యలను ప్రోత్సహిస్తే ఎలాగని ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ ప్రశ్నల వర్షం కురిపించారు. సొంత తల్లి, చెల్లిని గౌరవించడం వైసీపీ నేతలకు చేత కాదన్నారు. మహిళలను గౌరవించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళలను గౌరవించే సంస్కృతి వైసీపీకి లేదని, కూటమి ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. జగన్ తల్లి, చెల్లి అయినా, ఇంకే మహిళ జోలికి వెళ్లినా తాము ఊరుకోమని హెచ్చరించారు. బెంగళూరులో ఉన్న జగన్.. అంబటి రాంబాబు ఏదో రెండు చిన్న మాటలు అన్నారని ఎలా అంటున్నారని ఫైర్ అయ్యారు లోకేశ్. సీఎం తల్లిని దారుణంగా అవమానిస్తే అది ఏదో రెండు చిన్నమాటలా? అని దుయ్యబట్టారు. మహిళలంటే వైసీపీ నేతలకు గౌరవం లేదని మండిపడ్డారు. అంబటి రాంబాబు చేసిన స్టేట్‌మెంట్ కరెక్టా, తప్పా స్పష్టం చేయాలని బొత్స సత్యనారాయణని డిమాండ్ చేశారు.ఇదే అంశంపై వైసీపీ నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ.. అంబటి రాంబాబుపై దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. అంబటి రాంబాబును కించపరిచేలా మాట్లాడటంతోనే అంబటి అలా మాట్లాడారని

2లో

# శ్రీకాళహస్తిలో గిరి ప్రదక్షిణను ప్రారంభించిన పవన్ కల్యాణ్



**తిరుపతి, ఫిబ్రవరి 13 క్రైమ్ కౌంటర్ న్యూస్):** వారసత్వం, కళాసంపద, ధర్మ పరిరక్షణ.. ఆలయాల చుట్టూనే ఉందని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్వ్యాఖ్యానించారు. నాగరికతకు ఆలయాలు చిహ్నాలని పేర్కొన్నారు. శ్రీకాళహస్తిలో గిరి ప్రదక్షిణను శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు డిప్యూటీ సీఎం. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి ఆలయ దర్శనానికి త్వరలోనే తప్పకుండా వస్తానన్నారు. జగన్ హయాంలో పలు ఆలయాల్లో అపచరాలు చాలా జరిగాయని ఈ సందర్భంగా ప్రస్తావించారాయన.

వైసీపీ హయాంలో పాలకమండళ్లు వారి విధులను సరిగ్గా నిర్వహించి ఉంటే తిరుమలతో పాటు ఆలయాల చుట్టూ ఇన్ని అపచారాలు జరిగేవి కాదని పవన్ తెలిపారు. రాజకీయాలకు తావు లేకుండా దేవుడికి కృతజ్ఞత పూర్వకంగా పాలకమండళ్లు పని చేయాలని సూచించారు. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షిణకు రూ.10 కోట్ల రూపాయలు వెచ్చించామని తెలిపారు. ప్రతి ఒక్క భక్తునికీ ఈ గిరి ప్రదక్షిణతో ద్వారా కైలాసగిరి ప్రదక్షిణ చేసిన ఫలతం దక్కాలన్నారు. 22 ప్రధాన ఆలయాలతో పాటు అనేక ఆలయాలకు వెళ్లే రోడ్లను అభివృద్ధి చేస్తున్నామని పవన్ పేర్కొన్నారు.

గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపిన డిప్యూటీ సీఎం పవన్.. అసెంబ్లీలో ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొని గవర్నర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం కేంద్ర బడ్జెట్‌పై చర్చలు కొనసాగాయి. 5 కోట్ల మంది ప్రజల ఆకాంక్షలను మోసుకెళ్లే బడ్జెట్ ఇదని చెప్పుకొచ్చారు. అపార అనుభవంతో గత ప్రభుత్వ వారసత్వ సమస్యలను సీఎం చంద్రబాబు పరిష్కరిస్తున్నారని చెప్పుకొచ్చారు. మరో మూడు నెలల్లో కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తిచేసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రశంసించారు. 'నీలో సాహసం ఉంటే దేశం అంధకారంలో ఉంటుందా...' అని కవి శేషేంద్ర చెప్పిన కవితను.. మోదీని ఉద్దేశించి కొనియాడారు పవన్ కల్యాణ్.

ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి ఆనం

సంక్షేమ ఆంధ్రప్రదేశ్ మాత్రమే కాదని ఆధ్యాత్మిక ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని.. ఇందుకోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని ఏపీ దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పేర్కొన్నారు. 15,016 ఆలయాలకు పాలకమండళ్లను వేయాల్సి ఉందని తెలిపారు. ఇప్పటికే సుమారు వెయ్యి ఆలయాలకు పాలమండళ్లను నియమించామని చెప్పుకొచ్చారు. మిగిలిన వాటిపైనా దృష్టి సారిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు.



# జగన్ హయాంలో మద్యనిషేధం పేరుతో రేట్లు పెంచారు: మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి, ఫిబ్రవరి 13 క్రైమ్ కౌంటర్ న్యూస్):** ఏపీ అసెంబ్లీ సమావేశాలు మూడో రోజు ప్రారంభమయ్యాయి. శుక్రవారం సభలో ప్రశ్నోత్తరాలు కొనసాగుతున్నాయి. కల్తీ మద్యంపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర సమాధానం ఇచ్చారు. కల్తీ మద్యంపై ఏపీ అసెంబ్లీలో వాడీవేడిగా చర్చలు జరుగుతున్నాయి. కల్తీ మద్యానికి సంబంధించి 29 కేసులు నమోదు చేశామని తెలిపారు. కల్తీ మద్యం తరలింపునకు ఉపయోగించిన 34 వాహనాలను సీజ్ చేశామని చెప్పుకొచ్చారు. వైసీపీ హయాంలో ఇతర రాష్ట్రాల నుంచి ఏపీకి తీసుకొచ్చిన నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై 31,081 కేసులు నమోదయ్యాయని తెలిపారు.

కల్తీ మద్యం స్కాంపై సిట్ విచారణ..

ఈ కేసుల్లో రవాణాకు ఎన్‌డీపీఎల్ అక్రమ రవాణాకు ఉపయోగించిన 10,232

2లో

## మోదీ రాజకీయ జీవితంపై ట్రంప్ వ్యాఖ్యలు..

వ్యాప్తంగా చర్చకు దారి తీసింది.
ముఖ్యంగా ఈ వీడియోపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్‌కు మీడియా ప్రతినిధుల నుంచి ప్రశ్నలు ఎదురయ్యాయి. దీంతో దీనిపై స్పందించిన ఆయన.. ప్రస్తుతానికి తాను ఆ వీడియో చూడలేదని చెప్పారు. నిజంగానే ట్రంప్ మోదీపై, భారత్‌పై కామెంట్లు చేసినా, ఒకవేళ ఎవరైనా కావాలనే ఈ వీడియోను సృష్టించినా తాము కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.
మరోవైపు నెటిజెన్లు సైతం ఈ వీడియోపై స్పందిస్తున్నారు. ట్రంప్ సరదాగా ఇలాంటి కామెంట్లు చేశారని.. ఇందులో అంత తప్పుగా చూడాల్సిన అంశమేమీ లేదంటున్నారు. కానీ మరికొందరు మాత్రం భారతీయుల గురించి ట్రంప్ తప్పుగా మాట్లాడారని, మోదీకి ట్రంప్ ఇష్టం అని చెప్పినంత మాత్రానా దాన్ని స్నేహంగా కాకుండా మరో బంధంగా ఇండియన్లు చూడరంటూ చెప్పుకొస్తున్నారు. మరి ట్రంప్ చేసిన ఈ కామెంట్లు మీకెలా అనిపిస్తున్నాయో కామెంట్ల రూపంలో తెలియజేసేయండి.

## జగన్ అండ్ కోపై లోకేశ్ ధ్వజం

చెప్పుకొచ్చారు. విజ్ఞత కలిగిన వ్యక్తి కాబట్టే తప్పుగా మాట్లాడిన తన మాటలు వెనక్కి తీసుకుంటున్నట్లు వెంటనే తెలిపారని అన్నారు. చేసిన తప్పును క్షమించాలని అంబటి రాంబాబు కోరారని ప్రస్తావించారు. అలాంటి వ్యక్తిపై దాడులు చేయడం ప్రజాస్వామ్యంలో మంచిపద్ధతేనా అని ప్రశ్నించారు. మరో వైసీపీ నేత ఇంటిపై పెట్రోల్ బాంబులు వేయడం సరైనదేనా అంటూ నిలదీశారు. తప్పు ఎవరు చేసినా తప్పు తప్పే... సమర్థించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అప్పుడు ఉన్న పరిస్థితుల్లో మాట్లాడానని క్షమించాలని అంబటి కోరారని అన్నారు. క్షమాపణలు చెప్పినా అంబటిని వేధిస్తున్నారని, చేసిన దానికి భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు.

## జగన్ హయాంలో మద్యనిషేధం పేరుతో రేట్లు పెంచారు: మంత్రి కొల్లు రవీంద్ర

వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు మంత్రి రవీంద్ర పేర్కొన్నారు. కల్తీ మద్యం స్కాంపై 13 ల్యాబ్‌లలో సిట్ అధికారులు పరిశీలించిన తర్వాతే విచారణ చేస్తున్నారని తెలిపారు. వైసీపీ హయాంలో ఎన్నికల ముందు సంపూర్ణ మద్యనిషేధం అని చెప్పి తర్వాత రేట్లు పెంచారని ధ్వజమెత్తారు. వైసీపీ హయాంలో మద్యం ధర పెంచారని.. చాలా మంది ఈ ధరలు చెల్లించలేక జంగారెడ్డిగూడెం లాంటి చోట కల్తీ మద్యం తాగి చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం సరఫరాను నాడు అంతా ఒక మాఫియాలా చేశారని ఆరోపించారు. ములకల చెరువు కల్తీ మద్యం కేసులో వైసీపీ హయాంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా నిందితులుగా ఉన్నారని ప్రస్తావించారు. కూటమి ప్రభుత్వంలో ఎక్కడ కల్తీ లిక్కర్ సరఫరా జరగకుండా నవోదయం పేరుతో క్యాంపెయిన్ చేస్తున్నామన్నారు.
నాడు మద్యం నిషేధమని చెప్పి..: ఎమ్మెల్యే వసంత
జగన్ హయాంలో దశలవారీ మద్యం నిషేధమని చెప్పి తుంగలో తొక్కిందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. ఈ కేసులో ముద్దాయిల్లో విజయసాయి రెడ్డి ఒకరిగా ఉన్నారని ప్రస్తావించారు. కింగ్ పిన్, ఆయన వెనుక ఉన్న కింగ్ ఎవరో ఈ కేసులో బయటకు రావాలని చెప్పారు. రూ.3,500 కోట్ల స్కాంలో 360 రోజులయినా బెయిల్ ఇవ్వమని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని అన్నారు.
ఈ కేసుపై సిట్ అధికారులు విచారణ చేస్తున్నారని.. ఈ స్కాంలో రూ.3500 కోట్లు కుంభకోణం జరిగినట్లుగా తెలుస్తోందన్నారు. మద్యం ధర పెంచితే తాగరనే సాకుతో నాణ్యమైన మద్యాన్ని మందుబాబుల నుంచి దూరం చేశారని అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక నాణ్యమైన మద్యాన్ని రూ.99లకే అందిస్తోందని చెప్పుకొచ్చారు. జగన్ హయాంలో తప్పు చేశారని.. నాటి ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధమైన విధానం మంచిది కాదని ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ పేర్కొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలో ఓటు హక్కు వినియోగించుకున్న జనసేన నేత వకీల్ సాబ్



క్రైం కౌంటర్ న్యూస్ మాచర్ల పులిమెల మాణిక్యం రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు దాదాపు ఏడున్నరేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత,సుప్రీంకోర్టు నియమించిన కమిటీ ఆధ్వర్యంలో ఈ రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలు నిర్వహించబడ్డాయి.ఫిబ్రవరి 13, 2026న ఈ పోలింగ్ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగింది.ఎన్నికల నేపథ్యం రాష్ట్ర బార్ కౌన్సిల్లోని 23 స్థానాల కోసం ఈ ఎన్నికలు జరిగాయి.దీని కోసం రాష్ట్రవ్యాప్తంగా 109 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.మొత్తం 35,000 మందికి పైగా న్యాయవాదులు ఓటర్లుగా తమ ప్రతినిధులను ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా మాచర్ల పట్టణంలో మాచర్ల బార్ అసియేషన్ న్యాయవాదులందరూ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ ప్రక్రియ లో భాగంగా జనసేన నేత వకీల్ సాబ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఈ కార్యక్రమం మాచర్ల బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల అధ్యక్షులు, కార్యదర్శి మొదలైనవారు ఎన్నికల అధికారులు మరియు ఇతర న్యాయవాదుల సమక్షంలో ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరిగినట్లు . తెలియజేశారు.

## పులిమెల జ్ఞానమ్మ నివాళు లర్పించిన, రామిశెట్టి బాబురావు.




క్రైం కౌంటర్ న్యూస్ దుర్గి.పులిమెల మాణిక్యం.పల్నాడు జిల్లా,దుర్గి మండలం,ముటుకూరు గ్రామ ఎస్సీ కాలనీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభిమాని,కార్యకర్త అయిన పులిమెల ప్రసాద్(తాతయ్య) భార్య పులిమెల జ్ఞానమ్మ శుక్రవారం ఉదయం మృతి చెందారు(వయస్సు 45 సంలు).ఈ నేపథ్యంలో ముటుకూరు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు రామిశెట్టి బాబురావు,కొల్లి వెంకటేశ్వర్లు(కొండలు)స్థానిక ఎస్సీ కాలనీ నాయకులతో కలిసి పార్దేవ దేహానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జ్ఞానమ్మ కుటుంబానికి మట్టి ఖర్చులు నిమిత్తం రామిశెట్టి బాబురావు ఆర్థిక సహాయాన్ని 5000 వేలు రూపాయలు అందజేసి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి మనో ధైర్యం కల్పించారు.జ్ఞానమ్మ మృతి ఎంతో బాధాకరం అన్నారు.పరామర్శించిన వారిలో స్థానిక ముటుకూరు వైఎస్ఆర్ సీపీ పార్టీ సీనియర్ నాయకులు,ఎస్సీ కాలనీ వైఎస్ఆర్సిపి నాయకులు,కార్యకర్తలు, మహిళలు,అభిమానులు తదితరులు ఉన్నారు.

## సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఫిబ్రవరి 15న అధికారిక సెలవు దినంగా ప్రకటించాలి- భూక్యా రామాంజనేయులు నాయక్



. (క్రైమ్ కౌంటర్)( నాయక్) (బెల్లంకొండ)ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో నివసిస్తున్న లంబాడి--బంజారా సమాజం కోట్లాది ప్రజల ఆధ్యాత్మిక మార్గదర్శకుడు, సంస్కృతి పరిరక్షకుడు, ధర్మరక్షకుడు సద్గురు సేవాలాల్ మహారాజ్ గారు. ఆయన బంజారా జాతి అభ్యున్నతి కోసం చేసిన త్యాగాలు, సమాజ చైతన్యం కోసం చేసిన కృషి, హిందూ ధర్మ పరిరక్షణకు అందించిన సేవలు అపారమైనవి. ఆయన చూపించిన మార్గం సమానత్వం, నీతి, సేవాభావం, ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. ఇతర సామాజిక వర్గాల మహనీయుల జయంతుల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అధికారిక సెలవులు ప్రకటిస్తున్న నేపథ్యంలో, లంబాడి--బంజారా సమాజానికి ఆధ్యాత్మిక ప్రేరణగా నిలిచిన సద్గురు సేవాలాల్ మహారాజ్ గారి జయంతి రోజున కూడా అధికారిక సెలవు ప్రకటించాలని పల్నాడు జిల్లా లంబాడిల ఐక్యవేదిక అధ్యక్షులు భూక్యా రామాంజనేయులు నాయక్ ప్రభుత్వానికి కోరుతున్నారు

## ఆర్భాటంగా కృష్ణారావు నూతన గృహప్రవేశ కార్యక్రమం



ఒంగోలు: క్రైమ్ కౌంటర్ జిల్లా ప్రతినిధి సతీష్ పట్టణంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, జిల్లా అధ్యక్షులు కృష్ణారావు నూతన గృహప్రవేశ కార్యక్రమం అత్యంత ఆర్భాటంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాస రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి, ఉడా చైర్మన్ షేక్ రియాజ్, మున్సిపల్ చైర్మన్ గంగాధర్ సుజాత అనేకమంది ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కృష్ణారావు వారందరిని సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే మహిధర్ రెడ్డి లు మాట్లాడుతూ కృష్ణారావు తమకు ఎంతో ఆత్మీయుడని అన్నారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా తమ వద్దకు వచ్చి ఆ సమస్య పరిష్కారం అయ్యేలా చూస్తాడని వారు కొనియాడారు. వైద్య ఆరోగ్య శాఖ కే కాక సామాన్య ప్రజలకు ఆయన సేవలు అవసరమని వారు పేర్కొన్నారు.

## మొక్కలు నాటండి పర్యావరణానికి మేలు చేయండి గుంజా గంగారావు



క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు పెద్దకూరపాడు నియోజకవర్గం : మొక్కలు పర్యావరణానికి మేలు చేస్తాయని ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని పెదకూరపాడు నియోజకవర్గ బీసీ సెల్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బెల్లంకొండ మండలంలో చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన గుంజ గంగారావు శుక్రవారం పిలుపునిచ్చారు . ఈ సందర్భంగా ఆయన గ్రామస్తులతో కలిసి గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహం ముందు మొక్కలు నాటారు మొక్కలు చల్లని నీడనిస్తాయని మంచి ఆక్సిజన్ అందిస్తాయని తెలియజేశారు . మొక్కలు పెంచడం వలన వర్షాలు సకాలంలో కురుస్తాయని తెలిపారు ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## అంకెలతో ఆటలు పదాలతో పదనిసలు పలికిస్తున్న జిఎఫ్ఎల్ఎన్ కంభం:



క్రైమ్ కౌంటర్ న్యూస్ ....మార్కాపురం జిల్లా...అంకెలతో ఆటలు పదాలతో పదనిసలు పలికిస్తున్న జిఎఫ్ఎల్ఎన్ కంభం: గ్యారంటీడ్ ఫౌండేషన్ లిటరసీ,న్యూమరసి కార్యక్రమం ద్వారా విద్యార్థుల పఠన నైపుణ్యాలలో గణనీయమైన మార్పులు వస్తున్నాయని ఎంఈవోలు టి.అబ్దుల్ సత్తార్, టి.శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం స్థానిక బోర్డు స్కూల్లో నిర్వహిస్తున్న జిఎఫ్ఎల్ఎన్ కార్యచరణ ప్రణాళికలను వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలుగు,ఆంగ్లం పాఠాలను అనర్గళంగా చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను అభినందించారు. గణితంలోని చతుర్విధ ప్రక్రియల్లో విద్యార్థుల చురుకుదనాన్ని ప్రశంసిస్తూ, జి ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంతో విద్యార్థులు అంకెలతో ఆటలాడుతూ పదాలతో పదనిసలు పలికిస్తున్నారని కితాబిచ్చారు. అనంతరం విద్యార్థుల ప్రగతి పత్రాలను పరిశీలించి ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. ఉపాధ్యాయురాలు ఖుర్షీద్ తహ్మీన్ బోధనా నైపుణ్యాలను ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వరికుంట్ల.వెంకటేశ్వర్లు, ఐఈఆర్పీ ఈశ్వరి తదితరులు ఉన్నారు......

## ఈ ముక్కస్తే పదినిమిషాల్లో కోసూరు వెళ్ళొచ్చు




క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు కోసూరు న్యూస్ : పెదకూరపాడు నియోజకవర్గంలోని గారపాడు అందుకూరు మధ్యలో కిలోమీటర్ మేర రోడ్డు పెచ్చులతో లేచిపోయి వాహనదారులకు ఇబ్బందిగా ఉంది ఇటీవల కాలంలో రోడ్లపై ప్రత్యేక దృష్టి పెట్టిన ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈ రోడ్డుపై దృష్టిసరించాలని పెదకూరపాడు నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టితే పెదకూరపాడు నుండి పది నిమిషాలకే కోసూరు వెళ్ళవచ్చు అలాగే కోసూరు నుండి పెదకూరపాడు పది నిమిషాల్లో రావచ్చు ఇది ప్రజా అభిప్రాయం అధికారులు కూడా సమస్య ఉన్న ఇటువైపు చూడాలని ప్రజలంటున్నారు నియోజకవర్గంలోని రోడ్లకు మరమ్మత్తులు చేపట్టుతున్న తరుణంలో ప్రజలు అంటున్న మాట ఇది

## విద్యార్థులకు ఇచ్చే ట్యాబ్‌లను కేవలం చదువుకే పరిమితం చేయాలని నాగబాబు సూచన



**ఫిబ్రవరి 13 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** 16 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులకు సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని జనసేన ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు కోరారు. ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ చిన్నారులు సైబర్ నేరాలు, ప్రమాదకరమైన ఆన్‌లైన్ ట్రెండ్స్ బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. సోషల్ మీడియా కట్టడికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సోషల్ మీడియాలో మంచి, చెడులను విశ్లేషించుకునే విచక్షణ పెద్దలకు ఉంటుందని, కానీ 16 ఏళ్ల లోపు పిల్లలకు ఆ పరిపక్వత ఉండదని నాగబాబు అన్నారు. గతంలో 'బ్లూ వేల్ చాలెంజ్' వంటి ప్రమాదకరమైన క్రీడలకు ఆకర్షితులై ఎంతోమంది చిన్నారులు ఆత్మహత్యలు చేసుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుతం 'మెమో చాలెంజ్'స్కల్ బ్రేకర్ చాలెంజ్ఫైర్ చాలెంజ్' వంటి ప్రాణాంతకమైన సాహసాలు పిల్లలను ఆకర్షిస్తున్నాయని, వాటికి ఆకర్షితులై కొందరు ప్రాణాలు కోల్పోతుంటే, మరికొందరు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పినట్లుగా సోషల్ మీడియాను కట్టడి చేసేందుకు కఠినమైన చట్టాలు రూపొందించాలని నాగబాబు ప్రభుత్వానికి సూచించారు. ఆస్ట్రేలియా ఫ్రాన్స్, డెన్మార్క్ వంటి పలు ఐరోపా దేశాలు ఇప్పటికే 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాయని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఐటీ పోలీస్ విద్యాశాఖలు సమన్వయంతో పనిచేసి సోషల్ మీడియా అరాచకాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.హోం, ఐటీ, విద్యా శాఖలు సంయుక్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడాన్ని ఆయన అభినందించారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ట్యాబ్‌ల వంటి ఎలక్ట్రానిక్ పరికరాల్లో కేవలం విద్యకు సంబంధించిన సమాచారం మాత్రమే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆ ట్యాబ్‌లలో సోషల్ మీడియా యాప్‌లను వాడకుండా పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. పాఠశాలల్లో జరిగే పేరెంట్స్-టీచర్స్ సమావేశాల్లో తల్లిదండ్రులకు ఈ విషయంపై అవగాహన కల్పించాలని, తద్వారా చిన్నారుల భవిష్యత్తును కాపాడవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు.

## అందుబాటులోకి కొత్త ఆర్వోబీ..



**ఫిబ్రవరి 13 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** వాహనదారులకు ముఖ్య గమనిక. ట్రాఫిక్ కష్టాలకు చెక్ పెట్టేలా మరికొన్ని రోజులలో కొత్త రైల్వే ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. విశాఖపట్నంలో వాహనదారుల ట్రాఫిక్ సమస్యలకు ముగింపు పలికేలా ఎన్ఏడీ జంక్షన్ – కాకానిగర్ మధ్యలో రైల్వే ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి రానుంది. ఈ ఆర్వోబీ పనులు సుమారుగా పూర్తి అయ్యాయి. ఫిబ్రవరి 15వ తేదీన ఈ ఆర్వోబీని అధికారికంగా ప్రారంభించనున్నారు. నిర్మాణ పనులు పూర్తి కాగా.. వంతెనకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. ఆర్వోబీకి ఇరువైపులా బీటీరోడ్డు, కాంక్రీటు పనులు పూర్తయ్యాయి. ఆర్వోబీ ప్రారంభోత్సవానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మరోవైపు కేంద్రం సహకారంతో ఏపీ ప్రభుత్వం రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టులు. జాతీయ రహదారుల నిర్మాణం వేగవంతం చేసింది. ఇందులో భాగంగానే విశాఖలో కీలకమైన ఆర్వోబీ నిర్మాణం పూర్తి చేసింది. ఎన్ఏడీ జంక్షన్ – కాకానినగర్ ఆర్వోబీ నిర్మాణాన్ని రెండు సంవత్సరాల కిందటే పూర్తి చేయాల్సి ఉంది. అయితే అనుమతుల జారీలో జాప్యంతో కొంచెం ఆలస్యం అయ్యింది. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జిని18 మీటర్ల ఎత్తులో రైలు పట్టాలపై నిర్మించారు. 210 మీటర్ల పొడవు ఉండనుంది. ఆర్వోబీకి రెండు వైపులా అప్రోచ్ రోడ్లు ఉంటాయి.

మరోవైపు విశాఖపట్నంలో ఎన్ఏడీ జంక్షన్ చేరుకోవడం ఒక ఎత్తు అయితే.. అక్కడి నుంచి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకోవటం మరింత ఇబ్బంది. ఈ నేపథ్యంలో ఎన్ఏడీ జంక్షన్ నుంచి కాకానినగర్ చేరుకునేలా ఈ ఆర్వోబీ నిర్మిస్తున్నారు. మరోవైపు రైల్వేఓవర్ బ్రిడ్జితో పాటుగా సర్వీస్ రోడ్లు కూడా అందుబాటులోకి వస్తే మొత్తం ఆరు రోడ్లు వాహనదారులకు అందుబాటులోకి వస్తాయి. దీంతో ఆర్వోబీ పైనుంచి, అలాగే కింది నుంచి వాహనాల రాకపోకలకు వీలవుతుంది.

విశాఖపట్నం ఏపీ ఆర్థిక రాజధానిగా రూపాంతరం చెందుతోంది. పలు ఐటీ కంపెనీలు, అంతర్జాతీయ సంస్థలు విశాఖలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. దీంతో విశాఖ పారిశ్రామికంగా అభివృద్ధి చెందడమే కాకుండా నగరం కూడా విస్తరిస్తోంది. ఈ నేపథ్యంలో నగరం భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రచిస్తోంది. ఇందులో భాగంగా రహదారి ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి సారించింది. వాహనదారులకు ట్రాఫిక్ ఫ్రీ జర్నీ అందించేలా చర్యలు తీసుకుంటోంది.

# సొంత ఇంటి కల సాకారం దిశగా అడుగులు : లబ్ధిదారులకు ఏఈ జోగారావు సూర్య పిలుపు

**(బెల్లంకొండ )( క్రైమ్ (కౌంటర్ )(నాయక్)** మండలంలో 2021-22 ఆర్థిక సంవత్సరానికి గాను మంజూరైన గ్రామీణ గృహ నిర్మాణ పథకం పనుల్లో పురోగతి లేని లబ్ధిదారులపై గృహ నిర్మాణ శాఖ ఏ ఈ జోగారావు సూర్య ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు మండలంలో మొత్తం 209 ఇళ్లు మంజూరు కాగా,110 గృహాలు పూర్తిస్థాయిలో కంప్లీట్ అయినవి ఇప్పటికీ 99 మంది లబ్ధిదారులు తమ ఇంటి నిర్మాణ పనులను ప్రారంభించలేదు. 2026 సంవత్సరం వచ్చినప్పటికీ పనుల్లో పురోగతి లేకపోవడంతో, సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తున్నట్లు హౌసింగ్ ఏఈ కురువేళ్ల జోగారావు సూర్య తెలిపారు.

గతంలో ఇల్లు కట్టుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి 5,000 రూపాయల అడ్వాన్స్ చెల్లించింది. అయితే ఏళ్లు గడుస్తున్నా పునాదులు కూడా తీయకపోవడాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఈ నేపథ్యంలో, సంబంధిత లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి. వెంటనే ఇళ్ల నిర్మాణం ప్రారంభించాలని, లేనిపక్షంలో ప్రభుత్వం నుండి తీసుకున్న అడ్వాన్స్ 5000 సొమ్మును తిరిగి చెల్లించాలని ఏఈ స్పష్టం చేశారు.

గ్రామాల వారీగా పెండింగ్ వివరాలు:

మండల వ్యాప్తంగా ఉన్న పెండింగ్ ఇళ్లలో చంద్రాజు పాలెంలో 22, బెల్లంకొండలో 17, మాచాయపాలెంలో 14, నందిరాజుపాలెంలో 13, నాగిరెడ్డిపాలెంలో 8,



వ న్నాయపాలెంలో 7, గంగిరెడ్డిపాలెంలో 6, వెంకటాయపాలెంలో 4, ఎం.ఎస్. పాలెం, పాపాయపాలెంలో ఒక్కొక్కటి చొప్పున పనులు ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలో కొత్తగా వచ్చిన ఏఈ జోగారావు సూర్య స్వయంగా రంగంలోకి దిగి గ్రామ నాయకులు మరియు లబ్ధిదారులతో సమావేశమవుతున్నారు. గృహ నిర్మాణ పనులను వేగవంతం చేసేలా వారిని మోటివేట్ చేస్తూ, సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని కోరుతున్నారు. నిర్లక్ష్యం వహిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# మండెపూడి గ్రామంలో ప్రజల వద్దకు ప్రవీణ్





**క్రైమ్ కౌంటర్ కోటేశ్వరరావు అమరావతి న్యూస్ :** ప్రజల వద్దకు ప్రవీణ్ 100 రోజులు 100 గ్రామాలు పర్యటన కార్యక్రమాన్ని అమరావతి మండలం మండెపూడిలో గ్రామంలో శుక్రవారం నిర్వహించిన పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే.రెవెన్యూ సమస్యలను పరిష్కరించడం పై అధికారులు దృష్టి పెట్టాలన్న ఎమ్మెల్యే. తక్షణమే పరిష్కారమయ్యే సమస్యలను అధికారులతో మాట్లాడి పరిష్కరించిన ఎమ్మెల్యే. సమయం పట్టే సమస్యలను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని ఆదేశించిన ఎమ్మెల్యే. ప్రతి సమస్య పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామన్న ఎమ్మెల్యే. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మంచినేని రాజా, మాజీ ఎంపీపీ పెనుముచ్చు రామకృష్ణ, పల్నాడు జిల్లా ఉపాధ్యక్షులు పార్టీబండ్ల బాలయ్య,యువ నాయకులు చందు, కోట అనిల్, రామ్మోహన్రావు, సోమశేఖర్, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హెరిటేజ్‌పై సాక్షి మీడియా ఆరోపణలు అవాస్తవమన్న కుటుంబరావు

**ఫిబ్రవరి 13 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** హెరిటేజ్ ఫుడ్స్‌పై వైసీపీ, సాక్షి మీడియా చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, కల్పిత కథలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని స్వర్ణాంధ్ర పీ4 ఫౌండేషన్ వైస్ చైర్మన్ పి. కుటుంబరావు తీవ్రంగా విమర్శించారు. ఒక పత్రికలో ప్రచురించిన కథనం కేవలం ఫిక్షన్ రైటింగ్ అని, అందులో వాస్తవాలు లేవని ఆయన కొట్టిపారేశారు. అబద్ధపు రాతలు మానుకోకపోతే సాక్షి యాజమాన్యం అల్మారాల్లోని అస్థిపంజరాలు బయటకు వస్తాయని, జైలు గడప తొక్కే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హెరిటేజ్ సంస్థ తన చరిత్రలో ఏ ప్రభుత్వానికి, దేవాలయానికి నెయ్యి సరఫరా చేయలేదని కుటుంబరావు స్పష్టం చేశారు. కేవలం తమ బ్రాండ్‌పై నేరుగా వినియోగదారులకు మాత్రమే అమ్ముతుందని తెలిపారు. హెరిటేజ్ వెబ్‌సైట్ నుంచి ఒక ఫోటోను ఎడిట్ చేసి ఇందాపూర్ డైరీలో నెయ్యి తయారవుతున్నట్లు తప్పుడు ప్రచారం చేశారని ఆరోపించారు. ఇందాపూర్ డైరీ అనేది హెరిటేజ్‌కు ఒక 'కో-మాన్యుఫ్యాక్చరింగ్' యూనిట్ మాత్రమేనని అక్కడ పాలు, పన్నీర్ వంటివి తయారవుతాయని నెయ్యి ఉత్పత్తి జరగదని వివరించారు. బ్రిటానియా హిందుస్థాన్ యూనిలివర్ వంటి దిగ్గజ సంస్థలకు ఉత్పత్తులు సరఫరా చేసే సోనాయ్ డైరీపై సిండికేట్ ఆరోపణలు చేయడం హాస్యాస్పదమన్నారు.ద్రవ్యోల్బణం కారణంగా దేశవ్యాప్తంగా నెయ్యి ధరలు పెరిగాయని ఈ వాస్తవాన్ని దాచిపెట్టి రాజకీయ కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. పదేళ్ల క్రితం ధరలతో ఇప్పటి ధరలను పోల్చి దోపిడీగా చిత్రీకరించడం అజ్ఞానమని అన్నారు.2014లో బస్తా రూ.250 ఉన్న భారతీ సిమెంట్ ధరను జగన్ రెడ్డి



ఇప్పుడు రూ.430కి అమ్ముతున్నారు. అది తప్పు కానప్పుడు, డైరీ ఉత్పత్తుల ధరలు పెరగడం ఎలా తప్పవుతుంది అని ఆయన ప్రశ్నించారు. టీటీడీకి నెయ్యి సరఫరా చేయని హెరిటేజ్, సిండికేట్ ఎందుకు అవుతుందని నిలదీశారు.గత ఐదేళ్లలో రూ.600 కోట్ల ప్రభుత్వ ప్రకటనలతో నష్టాల్లో ఉన్న సాక్షిని ఎలా పోషించారో బ్యాలెన్స్ షీట్లు చూస్తే తెలుస్తుందన్నారు. దేశంలో సాక్షి కంటే ఐదు రెట్లు పెద్ద పత్రికల మార్కెట్ విలువ రూ.1500 కోట్లు ఉంటే, 2008లోనే సాక్షికి రూ.3500 కోట్ల వాల్యుయేషన్ ఎలా వచ్చింది ఇది క్విడ్ ప్రో కోమనీ లాండరింగ్ కాదా అని కుటుంబరావు తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ నేత బొల్లా బ్రహ్మనాయుడి 'వల్లభ' నెయ్యి కూడా మార్కెట్‌లో అధిక ధరకే అమ్ముతున్నారని, దీనిపై సాక్షి ఎందుకు రాయదని ప్రశ్నించారు.

# వైసీపీ అధినేత జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అంటూ అభివర్ణించిన సోమిరెడ్డి



**ఫిబ్రవరి 13 (క్రైమ్ కౌంటర్ న్యూస్):** టీడీపీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వైసీపీ అధినేత జగన్ పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అని అభివర్ణించారు. జగన్‌కు విధ్వంసం, శవ రాజకీయాలు అంటే ఎంతో ఇష్టమని సోమిరెడ్డి విమర్శనాస్త్రాలు సంధించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ డిక్కీలో శవాన్ని వేసుకుని వచ్చిన తన ఎమ్మెల్సీ భుజాన్ని తట్టే నైజం జగన్‌ది. తన ర్యాలీలోనే కార్యకర్తలు చనిపోతే కనీసం పరామర్శకు వెళ్లరు. కానీ, బూతులు తిట్టిన వారిని మాత్రం పరామర్శిస్తారు. ర్యాలీలు చేపట్టి ఒకరిద్దరు చనిపోయేలా చేస్తారు. అందుకే జగన్‌ను 'మర్చంట్ ఆఫ్ డెత్' అంటాను అని తీవ్రంగా విమర్శించారు. కేవలం శవ రాజకీయాలు చేసేందుకే జగన్ తన పార్టీని స్థాపించారని ఆయన ఆరోపించారు.రాజకీయ ప్రత్యర్థుల తల్లిదండ్రులను దూషించిన వారిని జగన్ కనీసం కట్టడి చేయరని సోమిరెడ్డి మండిపడ్డారు. రాజకీయాల్లో ఇలాంటి సంస్కృతి మంచిది కాదన్నారు. నేతల తల్లిదండ్రులను దూషించే వారిని కఠినంగా శిక్షించేందుకు వీలుగా రాష్ట్రంలో ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# సినిమా



## నాతో సౌందర్య స్పెషల్ సాంగ్.

టాలీవుడ్ హాస్యనటుడు బాబు మోహన్ మాయలోడు సినిమా, అందులోని తన పాట సాధించిన అపూర్వ విజయం, అలాగే దివంగత నటి సౌందర్య సినీ రంగ ప్రవేశం వెనుక ఉన్న కొన్ని ఆసక్తికరమైన సంఘటనలను వివరించారు. తన సినీ కెరీర్‌లో 99% సినిమాలు తాను చూడలేదని చెప్పిన బాబు మోహన్, మాయలోడు సినిమాలోని ఒక పాట మాత్రం తనకు ఎంతో ప్రత్యేకమని, అది 365 రోజులు ఆడిందనే వార్త విని ఆశ్చర్యపోయానని తెలిపారు. ఒకానొక రోజు వేరే షూటింగ్ నిమిత్తం సారథి స్టూడియోలో ఉండగా, మాయలోడు సినిమా 365వ రోజు ఆడుతుందని, థియేటర్ వద్ద పెద్ద కటౌట్, సౌందర్యతో కలిసి తన చిత్రం కూడా ఉందని తెలిసి, స్వయంగా వెళ్లి చూశానని బాబు మోహన్ చెప్పారు. థియేటర్ వద్ద హౌస్‌ఫుల్ బోర్డు చూసి, 365 రోజులు ఆడుతున్న సినిమాకు హౌస్‌ఫుల్ ఎలా అని మేనేజర్‌ను ప్రశ్నించగా, మేనేజర్ చెప్పిన విషయం తనను ఆశ్చర్యపరిచిందని అన్నారు.ప్రేక్షకులు సుమారు 100 రోజుల నుండి ప్రతిరోజు ఉదయం టికెట్లు కొనుక్కుని, పాట వేసే సమయానికి వచ్చి, పాట చూసి వెళ్లిపోతుంటారని, లోపల కూర్చున్నవాళ్లు మాత్రమే సినిమా చూస్తారని మేనేజర్ వివరించారు. డాన్సర్ కాకపోయినా తాను నటించిన పాట అంత పెద్ద హిట్ అవ్వడం, ఇప్పటికీ పిల్లలు స్కూల్ డేస్‌లో ఆ పాటకు డ్యాన్స్ చేయడం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందని బాబు మోహన్ పేర్కొన్నారు.మనవరాలి పెళ్లి సినిమా కోసం కోడి రామకృష్ణ , శ్యామ్ బాబు క్యూట్‌గా ఉండే అమ్మాయి కోసం వెతుకుతున్నారని తెలిసి, తాను సౌందర్యను చూడగానే ఈ అమ్మాయి భలే ఉంటుంది, ఇన్నోసెంట్ క్యారెక్టర్‌కు సరిపోతుంది, ముద్దుగా ఉంది అని భావించి, రెండు స్నాప్స్ తీసి స్వయంగా శ్యామ్ ప్రసాద్ రెడ్డి ఇంట్లో ఇచ్చి వచ్చానని తెలిపారు. తిరుపతిలో మనవరాలి పెళ్లి షూటింగ్ జరుగుతుండగా, హరీష్ హీరోగా, తాను, కోట శ్రీనివాసరావు తండ్రీ కొడుకులుగా నటించిన ఆ సినిమాకు సౌందర్య ఎంపికయ్యారని అన్నారు. అయితే, మనవరాలి పెళ్లి సరిగా ఆడకపోయినప్పటికీ, ఆ సినిమా షూటింగ్ జరుగుతుండగానే ఆమె అమ్మోరు చిత్రానికి సెలక్ట్ అయ్యారని బాబు మోహన్ వెల్లడించారు. అమ్మోరు సినిమా ముందు రిలీజ్ అయ్యి బ్లాక్‌బస్టర్ హిట్ కావడంతో సౌందర్య స్టార్ హీరోయిన్‌గా మారారు. ఆ తర్వాత రాజేంద్రుడు గజేంద్రుడు, మాయలోడు సినిమాలు విడుదలయ్యాయి. మాయలోడు కంటే ముందు సౌందర్య స్టార్ కాదని, ఆ సినిమా తర్వాతే ఆమె ఒక సూపర్ హీరోయిన్ అయ్యారని బాబు మోహన్ అన్నారు.





## అవిసె గింజలతో చెడు కొలెస్ట్రాల్‌కు చెక్..

ముఖ్యంగా గుండె ఆరోగ్యాన్ని కాపాడటంలోనూ, పెరుగుతున్న బరువును అదుపు చేయడంలోనూ ఇవి మ్యాజిక్ లా పనిచేస్తాయి. నేటి కాలంలో ఒత్తిడి, సరిగ్గా లేని ఆహారపు అలవాట్ల వల్ల వచ్చే కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి సమస్యలకు అవిసె గింజలు ఒక సహజ సిద్ధమైన మందుగా ఉపయోగపడతాయి. ప్రతిరోజూ కేవలం ఒక చెంచా అవిసె గింజలను మన ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో కలిగే ఆ ఐదు అద్భుతమైన మార్పులు ఏంటో తెలుసుకుందాం..

అవిసె గింజల్లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్స్ పుష్కలంగా ఉంటాయి. ఇందులో ఉండే ఆల్ఫా లైనోలిక్ యాసిడ్ (ూూూ) గుండె కండరాలను బలపరచడమే కాకుండా, రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. దీనివల్ల గుండెపోటు వచ్చే ప్రమాదం గణనీయంగా తగ్గుతుంది. అంతేకాకుండా, వీటిలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల శరీరంలోని వాపులను తగ్గిస్తాయి. తక్కువ క్యాలరీలు ఉండే ఈ గింజలను ప్రతిరోజూ ఒక చెంచా పొడి రూపంలో లేదా స్మూతీలలో కలుపుకొని తీసుకోవడం వల్ల గుండె పదిలంగా ఉంటుంది.

మన శరీరంలో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో అవిసె గింజలు అద్భుతంగా పనిచేస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. ఇందులో ఉండే కరగని ఫైబర్ (పీచు పదార్థం) జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. దీర్ఘకాలిక మలబద్ధక సమస్యతో బాధపడేవారు ఒక గ్లాసు నీటిలో నానబెట్టిన అవిసె గింజలను తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఇది మెటబాలిజం రేటును పెంచి, శరీరాన్ని చురుకుగా ఉంచుతుంది.

బీపీ లేదా హైపర్ టెన్షన్ తో సతమతమయ్యే వారు ప్రతిరోజూ అవిసె గింజలను తీసుకోవడం శ్రేయస్కరం. ఇది సిస్టోలిక్, డిస్టోలిక్ బ్లడ్ ప్రెషర్ రెండింటినీ అదుపులో ఉంచుతుంది. ఉదయం బ్రేక్ ఫాస్ట్ లో ఒక టేబుల్ స్పూన్ లేదా రాత్రి డిన్నర్ సమయంలో వీటిని ఆహారంతో పాటు తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వాడటం వల్ల రక్తపోటు సహజంగానే అదుపులోకి వస్తుంది.

వెయిట్ లాస్ జర్నీలో ఉన్నవారికి అవిసె గింజలు ఒక ఉత్తమ ఆహారం. ఇందులో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల వీటిని తిన్న తర్వాత కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. దీనివల్ల పదే పదే ఆకలి వేయదు, తద్వారా అతిగా తినడం తగ్గుతుంది. బరువు నిర్వహణలో ఉన్నవారు సలాడ్లు, చపాతీలు లేదా యోగార్ట్ లో వీటి పొడిని వేసుకొని తీసుకోవచ్చు.

షుగర్ వ్యాధితో బాధపడుతున్న వారికి, ముఖ్యంగా టైప్ 2 డయాబెటిస్ ఉన్నవారికి అవిసె గింజలు ఎంతో మేలు చేస్తాయి. వీటిని పొడి రూపంలో తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు హఠాత్తుగా పెరగకుండా ఉంటాయి. యోగార్ట్ లేదా పన్నీర్ వంటి ప్రోటీన్ ఆహారంతో కలిపి వీటిని తీసుకోవడం వల్ల ఇన్సులిన్ సున్నితత్వం పెరుగుతుంది. ఇందులో ఉండే లిగనన్స్ అనే యాంటీ ఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక శక్తిని కూడా పెంచుతాయి.

అవిసె గింజలు మన ఆరోగ్యానికి ప్రకృతి ప్రసాదించిన వరం. అయితే వీటిని నేరుగా తినడం కంటే వేయించి లేదా పొడి చేసి తీసుకోవడం వల్ల పోషకాలు శరీరానికి మెరుగ్గా అందుతాయి. చపాతీ పిండిలో లేదా కూరల్లో కూడా వీటి పొడిని వాడుకోవచ్చు.



## ప్రతీరోజూ 4 గుడ్లు తిన్నారనుకోండి..

ఆరోగ్యకరమైన జీవనశైలికి ఆహారం, వ్యాయామం ఎంత ముఖ్యమో డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి వివరించారు. ఫ్యాటీ లివర్ సమస్య నివారణకు వెజిటేరియన్ డైట్ మంచిదని, అయితే ఇడ్లీ, పాలిష్డ్ రైస్ లాంటి కార్బోహైడ్రేట్లు సమస్యను పెంచుతాయని తెలిపారు. మిల్లెట్స్ మేలు చేస్తాయి. నాన్-వెజిటేరియన్‌లో ఫిష్, గుడ్లు ఫ్యాటీ లివర్‌కు తక్కువ కారణమని, రెడ్ మీట్ అస్సలు ముట్టుకోవద్దన్నారు. గుడ్ల విషయానికి వస్తే, పచ్చసొనలో కొలిన్(ఫ్యాటీ లివర్‌ను నివారిస్తుంది), కండరాలను రక్షించే పదార్థాలు ఉన్నందున, రోజుకు నాలుగు పచ్చసొనలు తినడం వల్ల ఎలాంటి హాని లేదన్నారు. సగటున 70 కిలోల వ్యక్తికి రోజుకు 70 గ్రాముల ప్రోటీన్ అవసరం. పప్పులు, మొలకలు, బీన్స్, ఫిష్, చికెన్, యోగర్ట్ మంచి ప్రోటీన్ వనరులు.

ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని డాక్టర్ గట్టిగా సూచించారు. అధిక కార్బోహైడ్రేట్లు, సోడియం, ప్రిజర్వేటివ్స్, కలరింగ్ ఏజెంట్స్ వల్ల గట్ మైక్రోబయోమ్ దెబ్బతిని, లివర్ డ్యామేజ్ అవుతుందన్నారు. ముఖ్యంగా పిల్లలకు ప్రాసెస్డ్ ఫుడ్ అలవాటు చేయరాదని, పాఠశాలల పరిసరాల్లో ఫాస్ట్ ఫుడ్‌ను నిషేధించాలని పిలుపునిచ్చారు. 150 నిమిషాల మోడరేట్ వ్యాయామం వారానికి తప్పనిసరి అని తెలిపారు. ఆర్గానిక్ ఆహారం, తాజా కూరగాయలు, బెర్రీలు, బ్రకోలీ, బీట్రూట్ వంటి వాటిని తీసుకోవడం ద్వారా గట్ ఆరోగ్యాన్ని మంచిగా ఉంటాయన్నారు.

సప్లిమెంట్లు, కలుషిత ఆహారం

విటమిన్ డీ, బీ12, ఫోలిక్ యాసిడ్ వంటి కొన్ని సప్లిమెంట్లు హానికరం కాదని, ముఖ్యంగా వెజిటేరియన్లకు బి12, ఫోలిక్ యాసిడ్ లోపాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. సహజమైన, పౌష్టికాహారం తీసుకుంటే సప్లిమెంట్ల అవసరం పెద్దగా ఉండదని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం మార్కెట్లో లభించే కూరగాయలు, పాలు, గుడ్లు, పండ్లలో కలుషితాలు, పురుగుమందులు అధికంగా ఉన్నాయని, ఇది సమాజం ఎదుర్కొంటున్న పెద్ద సవాలు అని, ఆర్గానిక్ ఆహారం వైపు మళ్లడం కష్టమైనప్పటికీ, దాని ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు.

## టీమ్ ఇండియాకు మళ్లీ వరల్డ్ కప్?

జింబాబ్వే క్రికెట్ జట్టు సృష్టించిన సంచలనం ఇప్పుడు భారత క్రికెట్ అభిమానుల్లో కొత్త జోష్ నింపుతోంది. తాజాగా జరిగిన టీ20 ప్రపంచకప్‌లో పటిష్టమైన ఆస్ట్రేలియాను జింబాబ్వే మట్టికరిపించడం కేవలం ఒక గెలుపు మాత్రమే కాదు, అది భారత్‌కు ఒక శుభసూచకమని విశ్లేషణలు మొదలయ్యాయి. గతంలో జింబాబ్వే జట్టు ఆసీస్‌పై విజయం సాధించిన ప్రతిసారీ, ఆ టోర్నీలో భారత జట్టు విశ్వవిజేతగా నిలవడం ఇప్పుడు అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గూగుల్ ఇండియా సైతం ఈ అరుదైన గణాంకాలను విశ్లేషిస్తూ భారత్‌కు కలిసొచ్చే అంశాలను ప్రస్తావించడంతో సోషల్ మీడియాలో ఈ చర్చ జోరందుకుంది.

చరిత్రను ఒక్కసారి వెనక్కి తిరిగి చూస్తే, 1983 వన్డే ప్రపంచకప్‌లో కపిల్ దేవ్ సారథ్యంలోని భారత్ ఛాంపియన్‌గా నిలవడానికి ముందు, గ్రూప్ దశలో జింబాబ్వే ఆస్ట్రేలియాను ఓడించి అందరినీ ఆశ్చర్యపరిచింది. సరిగ్గా అదే సీన్ 2007 టీ20 ప్రపంచకప్‌లోనూ రిపీట్ అయ్యింది. అప్పట్లో కూడా జింబాబ్వే చేతిలో ఆసీస్ చిత్తు కాగా, చివరకు ధోనీ సేన కప్పును ముద్దాడింది. ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ (స్కై) నేతృత్వంలోని టీమ్ ఇండియా బరిలో ఉండగా, మళ్ళీ అదే సీన్ రిపీట్ కావడం అభిమానుల్లో కప్పు గెలుస్తామనే ధీమాను పెంచుతోంది.

క్రికెట్ అనేది కేవలం ఆట మాత్రమే కాదు, ఇక్కడ సెంటిమెంట్లు మరియు గణాంకాలకు కూడా చాలా ప్రాముఖ్యత ఉంటుంది. ప్రస్తుతం స్కై సేన అద్భుతమైన ఫామ్‌లో ఉండటం, దానికి తోడు జింబాబ్వే అందించిన ఈ 'లక్కీ ఫ్యాక్టర్' తోడవ్వడంతో భారత అభిమానులు ఖుషీ అవుతున్నారు. ఆస్ట్రేలియా లాంటి దిగ్గజ జట్టును జింబాబ్వే ఓడించడం అనేది టోర్నీ సమీకరణాలను మార్చడమే కాకుండా, భారత్‌కు ఒక సానుకూల వాతావరణాన్ని సృష్టించిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ అద్భుతమైన యాదృచ్ఛికం మరోసారి నిజమైతే భారత్ మూడోసారి పొట్టి ఫార్మాట్‌లో కింగ్‌గా అవతరించడం ఖాయం.

ఈ అరుదైన సెంటిమెంట్‌ను చూస్తుంటే, కాలం మళ్ళీ వెనక్కి వెళ్తున్నట్లు అనిపిస్తోందని నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. కేవలం అదృష్టం మీద మాత్రమే కాకుండా, భారత జట్టు ప్రదర్శన కూడా ఈసారి చాలా బలంగా ఉండటం జట్టుకు ప్లస్ పాయింట్‌గా మారింది. 1983 మరియు 2007 నాటి మ్యాజిక్ 2026లో కూడా నిజమైతే, భారత క్రికెట్ చరిత్రలో ఇదొక మర్చిపోలేని అధ్యాయంగా మిగిలిపోతుంది. జింబాబ్వే విజయం టీమ్ ఇండియాకు కిరీటాన్ని తెచ్చిపెడుతుందో లేదో తెలియాలంటే టోర్నీ ముగిసే వరకు వేచి చూడాల్సిందే.




## రాజస్థాన్ రాయల్స్ కొత్త బాస్ 'రియాన్ పరాగ్..

ఐపీఎల్ చరిత్రలో అత్యంత ఆసక్తికరమైన మార్పులకు రాజస్థాన్ రాయల్స్ (==) శ్రీకారం చుట్టింది. జట్టు నూతన సారథిగా యువ బ్యాటర్ రియాన్ పరాగ్‌ను నియమిస్తున్నట్లు ఫ్రాంచైజీ అధికారికంగా ప్రకటించింది. గత సీజన్‌లో సంజూ శాంసన్ గైర్హాజరీలో కొన్ని మ్యాచులకు విజయవంతంగా కెప్టెన్సీ వహించిన పరాగ్, ఇప్పుడు పూర్తిస్థాయిలో జట్టును నడిపించనున్నాడు. సోషల్ మీడియా వేదికగా ఈ విషయాన్ని వెల్లడించిన రాయల్స్ యాజమాన్యం, పరాగ్ నాయకత్వంపై తమకు పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేసింది.

ఈ సందర్భంగా రాజస్థాన్ రాయల్స్ ఒక ప్రత్యేకమైన పోస్టర్‌ను విడుదల చేసి గత స్మృతులను నెమరువేసుకుంది. దివంగత లెజెండ్ షేన్ వార్న్ నుంచి మొదలుకొని రాహుల్ ద్రవిడ్, షేన్ వాట్సన్, అజింక్యా రహానే, స్టీవ్ స్మిత్ మరియు సంజూ శాంసన్ వరకు జట్టును నడిపించిన దిగ్గజాల పేర్లను అందులో ప్రస్తావించింది. ఈ మహామహుల సరసన ఇప్పుడు రియాన్ పరాగ్ చేరడం విశేషం. పాత తరం అనుభవం నుంచి కొత్త తరం దూకుడు వరకు జట్టు ప్రయాణం సాగిన తీరును ఈ పోస్టర్ అద్దం పడుతోంది. గతేడాది వరకు జట్టుకు వెన్నుముకగా నిలిచిన సంజూ శాంసన్ నిష్క్రమణ అభిమానులను కొంత ఆశ్చర్యానికి గురిచేసింది. ట్రేడింగ్ విండోలో భాగంగా సంజూ శాంసన్ చెన్నై సూపర్ కింగ్స్ జట్టులోకి వెళ్లడంతో రాజస్థాన్ కొత్త కెప్టెన్ కోసం అన్వేషణ మొదలుపెట్టింది. గత కొన్ని సీజన్లుగా నిలకడైన ప్రదర్శనతో పాటు, 2025 సీజన్‌లో తాత్కాలిక కెప్టెన్‌గా పరాగ్ చూపిన పరిణతి అతని వైపు మొగ్గు చూపేలా చేసింది. అస్సాం నుంచి వచ్చి ఐపీఎల్ జట్టుకు కెప్టెన్ కావడం పరాగ్ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

రియాన్ పరాగ్ నియామకంతో రాజస్థాన్ రాయల్స్ ఒక కొత్త శకంలోకి అడుగుపెట్టినట్లయింది. యువ ఆటగాళ్లకు పెద్దపీట వేసే రాయల్స్ సిద్ధాంతానికి పరాగ్ ఎంపిక సరైన ఉదాహరణగా నిలుస్తుంది. మైదానంలో దూకుడుగా ఉండే పరాగ్, సీనియర్ ఆటగాళ్లను ఎలా సమన్వయం చేసుకుంటాడనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రాబోయే సీజన్‌లో తనదైన శైలిలో జట్టును ప్లే ఆఫ్స్‌కు చేర్చి, రెండోసారి ట్రోఫీని గెలవడమే లక్ష్యంగా పరాగ్ సేన బరిలోకి దిగనుంది.



Published by katikala Vara Prasad. Owned by katikala Vara Prasad. Printed at Sunday printing press 3_4297 Saraswati complex SVN colony. guntur.ap 522006.published at D.no465 Le out no2 .Dodleru Road. Ysr Jagananna colony.Krosuru. Guntur AP. 522410. Editor. Katikala Vara Prasad.RNI APTEL/25/A2478. Ph:9849707349 . email:kvp6858@gmail.com.